# మొదటిసారి

రచయిత:

పిల్లలమర్రి బాలకృష్ణశాస్త్రి

అవి ఎండాకాలపు శెలవలు. ఆ మిట్ట మధ్యాన్నమప్పుడు మాక్కూడా (అంటే రాముడు బావకూ నాకూ) ఎండ అనిపించడం వల్ల ఇంటిపట్టున వుండాలిసి వచ్చింది—కాక మాది పల్లెటూరు. మానాన్నగారు గూడా వూళ్లో లేకపోవటంచేత చీట్ల పేక ఒకటి సంపాదించి దాంతో తీర్చుకుంటున్నాం మా పరీక్షల బడలిక అంతా.

ఆ సావిట్లోనే మొత్త నానుకుని మా అత్తయ్యా, ఆమె కెదురుగా మా అమ్మా కూర్చుని తెంపు లేకుండా రాచకార్యం చేస్తున్నారు. మధ్య మధ్య మా అత్తయ్య వత్తులు చేస్తూంది. మా అమ్మ పీటపెట్టుకు మినుముల్లో రాళ్లు చేస్తూంది.

చీట్లాటలో రాముడికీ నాకూ తగాదా వచ్చింది. తప్పు వాడిదే. ముక్క చెయి జారి పడ్డది; ప్రమాణపూర్తిగా నేను దిగాలని దిగలేదంటాను. వాడది నమ్మక అరవటం మొదలుపెట్టాడు.

'ఏమిట్రా—అగోలా? మాట తోచకో నివ్వకుండా గల్లంతు చేస్తున్నారు?—పాడు చీట్ల పేకా మీరూనూ!—అదుగో మామయ్య వస్తున్నాడు లే—మీపని చెపుతా వుండండి!' అని కోపంచేసింది మా అత్తయ్య.

చెప్పుల చప్పుడు గూడా వినపడింది. నేను వంగి వీధిగుమ్మంవైపు చూచాను.

'నిజంగానే వస్తున్నాడ్రో!—చీట్లు చాప కిందకి తొయ్యరా చప్పున' అన్నాను ఆదుర్దాతో.

ఆయన్ను చూస్తే మాకు హడలు. మాకే కాదు మా అమ్మకూ—మా అత్తయ్యకూ—మా వూళ్ళోవాళ్ళకూ చివరకు మా జిల్లాలో వాళ్ళందరికీ కూడా ఆయనంటే భయమే.

మీది కృష్ణా జిల్లా అయితే శీతారామయ్యగారి పేరు వినివుండక తప్పదు. ఆయన లేనివ్యాజ్యం ఆ కోర్టుల్లో వుండదు. మా చుట్టుపక్కల వూళ్ళవాళ్ళందరికీ ఆయన్ను చూస్తే భయమూ, కోపమూ. అట్లాఅని ఆయన దగ్గరకు రాక ఎంతవాడికీ తప్పదు.

ఆయన స్వచ్ఛమయిన బ్రాహ్మణ్యం జరుపుతూ వుడటం వల్ల కూడా కొంత గౌరవము సంపాదించాడు లోకంలో. ఇంట్లో వుంటే దేవతార్చనా, బ్రహ్మయజ్ఞమూ, పితృతర్పణా వగైరా రెండుగంటలు చేసేవాడు. వాయిదాలకు బస్తీకి పోతే ఏంచేసేవాడో తెలియదు. బహుశా మనస్సు రాయి చేసుకుని పూటకూళ్ళ ఇంటోనే తినేవాడు అనుకుంటాను.

ఆయన వైద్యం గూడా కొద్దిగా చేసేవాడు. ఎప్పుడో పూర్వము ఎవరెవరికో తను మందులు ఇచ్చినట్లూ, వాళ్ళంతా బతికినట్లూ చెప్పేవాడు. కొంతమంది ఆయన మాటలు

నమ్మి ఆయనయిచ్చిన మాత్రలు పుచ్చుకునే వాళ్లు. వైద్యానికని ప్రత్యేకం డబ్బు పుచ్చుకునేవాడు కాదు. కాని అన్నిటి వారా ఏ వ్యాజ్యంలోనో తీసేవాడు.

కొందరు బయట అధికారం చలాయిస్తూ, ఇంట్లోకిరాగానే పిల్లికూనల్లాగా అయిపోతారు. కాని మాతండ్రి ఆ తరగతివాడు కాదు. అందుకు కారణం మా అమ్మ ఏమో నాకు తెలియదు. మాఅత్తయ్యా రాముడూ పెద్ద ఆస్తిపరులయినప్పటికీ, రాముడికి తండ్రి పోవటంచేత వాడి ఆస్తి మానాన్నే మానేజీ చేస్తున్నప్పటికీ, వాళ్ళకుకూడా ధారాగతాలు లేవు ఆయనకు ఎదురు చెప్పటానికి.

మాతండ్రి గొప్ప తెలివిగలవాడనీ గొప్ప చదువులేక పోయినప్పటికీ, పెద్ద ప్రయోజకుడనీ, ఆయన్ను చూస్తే, నా మటుకు నాకు, భయమేకాక, భక్తిగూడా వుంటూవుండేది.

అందు కనే ఆయన వస్తున్నా డని మా అత్తయ్య అనగానే చీట్లను చాపకిందకు వెంటనే తోసి. చేతికందిన పుస్తకాలను చెరొకటి తీసుకొని చదువుతున్నట్టు నటిస్తూ కూర్చున్నాము.

ఆయన వచ్చి, మమ్ము నందరినీ ఒకసారి తేరిపారచూచాడు. చెప్పులు విడుస్తూనే చెప్పాడు: రెండువేల కట్నంతో రాముడికి మూర్తివారి సంబంధం కుదుర్చుకు వచ్చాననీ, రేపు దశమి నాటికి లగ్నమనీ, మా అందరికీ —అంటే రాముడికీ, నాకూ, మా అత్తయ్యకూ, మా అమ్మకూ—వినపడేటట్టుగా —ఏ ఒకళ్ళతోనో చెప్పినట్టుగా కాక— ఒకసభలో వుపన్యాసం ఇచ్చే ధోరణిలో— పెద్ద గొంతుతో చెప్పాడు. మాలో ఎవళ్ళన్నా 'ఇట్లా చేసావేం?' అని పొరపాటున అంటే విరుచుకు మీదపడేటట్టు చూచాడు.

ఆయన ఆముక్క అన్నప్పటినుంచీ, లగ్గం వరకూ మాలో మాకు జరిగిన సందర్భాలు —అంటే రాముడు నా ప్రోత్సాహంతో, వాళ్ళమ్మ దగ్గరకు వెళ్ళి—చిన్నతనంలో, చదువు పూర్తి కాకమునుపు—అందుట్లో కట్నాలు గిట్నాలు తీసుకొని—పెళ్ళి చేసుకోటం అనేది తన వుత్కృష్ట ఆశయా లన్నిటికీ భంగకరమని అర్థంవచ్చేమాటలు కొన్ని గొణగటం,—వాళ్ళమ్మ 'నోరుమూసుకోరా, నాయనా!—మామయ్య వినిపోతాడు!' అని ఒకే సమాధానం ఎన్నిసార్లయినా చెప్పటం; —చివరకు రహస్యాగా చోక్కా లని పేరు పెట్టి, నూరు రూపాయలు మా అత్తయ్య మాకు ఇవ్వటం;—చొక్కాలు, చుట్టాలు పెళ్ళికొడుకును చెయ్యటం సరదాలోపడి, రాముడు తన వుత్కృష్ట ఆశయాలన్నీ మరిచిపోవటం—ఇవన్నీ ప్రస్తుతం అనవసరమయిన డిటెయిల్సు.

పది పన్నెండేళ్ళ క్రితం—ఆ రోజులు వేరు —ఆ పెళ్లిల్లు వేరు—అ సరదాలు వేరు. ఇప్పుడు ఈ పెళ్లిల్లు—ఏం పెళ్లిల్లు!—ముఖ్యంగా ఓ ముగ్గురో ఏనై జామో వెళ్ళటం —రెండు పూటలు గడిపి రావటం—పెళ్లి అయిందని పుకారువెయ్యటం!—శారదా బిల్లు!—పాడు శారదా బిల్లు!—

పెళ్లివారి 'భళ్ల'ల్లో ఎక్కి తర్లిపోవటం బహు సరదాగా వుండేది. 'తర్లి పోవటం' అంటే—మజిలీలూ—భోజనాలూ—బోల్తాలూ—చద్దివణ్ణాలూ—మన ప్రాప్తాన్నిబట్టి, దొంగలూ—మధ్య మధ్య కొంచెం కొంచెంగా ప్రయాణంగూడా వుంటుంది.

ఎందుకో 'భళ్ళ'న్నీ చీకట్లో అమాంతంగా ఆగుతేయి.

'ఎందుకురా, అపారు!—సాగి పోనియ్యం

డి!—' అని అరుస్తావు చివర బండిలోంచి. జవాబు వుండదు. బోల్తాగావచ్చు, దొంగలు కావచ్చు, ఇంకా ప్రమాదమయింది ఏదైనా కావచ్చు. కర్రా లాంతరూ తీసుకొని, బండి దిగి, విచారణకు పోతావు. కారణం కనపడదు.

అనవసరంగా ఆపినందుకు ముందు బండివాణ్ణి కేకలేస్తావు. వాడికి కోపంవస్తుంది.

'యాండండీ?—కిష్టయ్యగోరూ?—మీరు ఎప్పుడూ ఇంతేనండీ!—లోకువగా వున్నాం గదా అని మా మీదండీ మీకూకేకలూ; (బండిలో వాళ్ళకేసి తిరిగి) 'యేమండీ!' శాసమ్మగారూ !—మీరు సెప్పండీ !—'అపశ!—అపశ!'అని కేక లెట్ట లేదండీ,ఓరో?' అని అంటాడు.

'అవునురా, అబ్బాయీ!—అట్లాగే వినపడ్డాయిరా మాక్కూడా—' అని ఆవిడగారు సాక్ష్య మివ్వటం—అప్పటికి అరగంట అవుతుంది. తీరా లగ్గం మించిపోతుందేమోనని బతిమాలి బళ్లు సాగతీస్తావు.

ఇంతకూ చెప్పొచ్చిం దేమిటంటే—ఇట్లాంటి అవస్తలు ఆటే పడకుండానే 'భళ్ళు' కట్టుకుని లగ్గంనాటి పొద్దుటికల్లా చేరుకున్నాం రాముడి అత్తవారి వూరు.

చిన్న పందిరివేసి తోరణాలు కట్టబడిన డాబా ముందు బళ్లు ఆగినయి. అంతా దిగండి ఇదే పెళ్ళివారివిడిది అన్నారుఎవరో.

బళ్ళవాళ్ళు పెట్టెలుదింపి, ముందు సావిట్లో మూలగా పెడుతున్నారు. ఆడవాళ్లతో, పిల్లలతో, బళ్లవాళ్లతో పెద్ద గల్లంతుగా వుంది.

ఇంతలో మా నాన్నగారి పెద్ద గొంతు వినపడ్డది. 'ఒరే సుబ్బన్నా!—ఆ పెట్టె అక్కడకాదురా వేరే వుంచాలిరా!' అని, నన్ను పిలిచి తను వరపూజకు తొందరచెయ్యటానికి వెళ్తున్నాననీ, ఆ పెట్టెను పక్కగదిలో భద్రపర్చమనీ చెప్పి పోయినాడు.

నేను దానిని పట్టుకొని లోనికి పోయినా. మెల్లాకు రెండువైపులా గదులున్నయి. ఏదో తెలియక ఒకగదిలో ప్రవేశించాను.

'ఎవరది?' అని సన్నని చక్కని గొంతు వినపడ్డది.

ఒక నిమిషంపాటు బిత్తరపోయి చూచాను. ఆమెకు 20 సంవత్సరములు వుంటయి. ఆమె అద్దంలోచూచుకొని దువ్వుకుంటూంది. నొక్కులు నొక్కులుగా వున్నజుట్టు మరి కాసిని నొక్కులు పడుతున్నది. ఆమెకళ్లు నాకు ఇప్పటికికూడా మరుపురాకుండా వున్నయి. అంతవరకూ ఆడవాళ్ళాలంటే ఎవరో అన్నట్టుగా వుండే నాకు ఒక్కసారిగా హృదయం పొంగిపోయింది. ఆమెను అట్లా చూస్తూ ఏళ్ల తరబడి అన్నం నీళ్ళూ లేకుండా నిల్చోగలననిపించింది.

'ఎవరండీ?' అన్నది మళ్ళీ, నా వంక చూస్తూ.

'పెళ్ళివారం' అన్నాను నా సహజమయిన బర్రెగొంతుకు సిగ్గుపడుతూ.

'అయితే?'

'మానాన్నగారు ఈపెట్టె ఏదోగదిలో పెట్టమన్నారు.'

'ఎవరు? శీతారామయ్యగారా? మీతండ్రిగారా?' ఆమెకళ్ళలో కొంచెం ఆశ్చర్యం కనిపించింది.

'ఈగది కాదు. ఆఎదురుగావున్న గది ఖాళీచేశాం మీకోసం. అందులో పెట్టండి' అంది. ఆమె గొంతకలోకి ఒక విధమయిన మార్పు వచ్చింది. అప్పటినుంచి నాతో చిరపరిచయం గలదిలాగా, ఎంతో చనువుగా,

మాట్లాడటం మొదలుపెట్టింది.

నేను పెట్టెతీసుకుని ఎదురుగావున్న గది లోకిపోయినా, దానిని కిందపెట్టి, మళ్ళీ ఆమె గదిలోకి ఏ మిషకల్పించుకుని పోదామా అని ఆలోచిస్తూ కూర్చున్నా పెట్టెమీద.

ఇంతలో ఆమె తాళంఒకటి తీసుకొని నా గదిలోకి వచ్చింది. 'తాళం మీరు తెచ్చుకు న్నారో లేదో అని ఒకటి వెతికి పట్టు కొచ్చాను. ఈ అయిదురోజులూ దీనినిమీరు వాడుకోండి' అన్నది.

నాకు మాట్లాడటానికి ఏమీ తోచలేదు. ఆకర్షిస్తూన్న ఆమె పెద్ద కళ్ళల్లోకి చూస్తూ కూర్చున్నా. ఆమె అందిస్తూన్న తాళాన్ని అందుకున్నా.

ఆమె ఒక్కనిమిషం ఆగి కొంటెతనంగా నావంక చూస్తూ 'మీకు ఇంకా ఏమయినా కావాలా?' అన్నది.

ఏమి కావలెనని చెప్పను? మాట్లాడేశక్తి అంతా ఒక్కసారిగా పోయినట్టుగా చూస్తూ కూర్చున్నా.

ఆమె గదివిడిచి పోవటానికి సిద్ధమయింది. పోతూ మళ్ళీ వెనక్కుతిరిగి, ఆ అందమయిన చూపులు నామీదవిసిరి 'ఒకవేళ యేదయినా కావలిస్తే నన్నుఅడగండి, నేను ఇక్కడే వుం టాను,' అని వెళ్ళిపోయింది.

దేవలోకంనుంచి ఒక్కసారిగా మామూలు ప్రపంచంలో పడ్డట్లయింది.

'పోయెనయ్యో ఇపుడు ననుబాసి...'అనే కీర్తన జ్ఞాపకంవచ్చింది. మనగొప్ప యాక్టరు ఒకాయన స్టేజిమీద ఒక వింగునుంచి ఇంకో వింగువరకూ గంతులేసి ఆక్టుచేసినట్టుగా చెయ్యలేదు కాని జ్ఞాపకం వచ్చినంతమట్టుకూ ఆచరణాలు అనకుండా ఫ్రూరుకోలేకపోయినా.

మొదటిరోజునే ఆమెపేరు కనుక్కున్నా. ఆమెపేరు లక్ష్మి. ఆమె ఇంటిఆవిడ కూతురు. తల్లీ కూతురూ తప్ప ఇంట్లో ఎవరూవున్నట్లు కనిపించలేదు. లక్ష్మిమొగుడు ఎక్కడ వున్నాడో తెలియదు. ఏదేశాంతరాల్లోనో చదువు తున్నాడేమో. వివరాలు బాగా చెప్పేవాళ్లు కనిపించలేదు.

ఆమెకు నాకంటే మహావుంటే ఒకఏడాది వుండొచ్చు, కాని ఆమెతో మాట్లాడుతున్న ప్పుడు నాకంటె ఎంతోపెద్దది అనిపించేది.

మొదట్లో ఆమెతో మాట్లాడటం బెరుగ్గా వుండేది. కాని రానురాను ఆమె వూతంవల్ల నేనుగూడా చాలాచనువుగా మాట్లాడటం నేర్చుకున్నాను.

లక్ష్మీ నేనూ రోజుకు వందసార్లయినా కలుసుకునేవాళ్ళం పళ్ళుతోమేటప్పుడూ— ఊరేగించేటప్పుడూ—పాటలు పాడేటప్పుడూ —పేర్లు చెప్పేటప్పుడూ—మేజువాణీ చేసే టప్పుడూ—ఫలహారాలు చేసేటప్పుడూ— ప్రమాదము లేకుండా ఆమెకు ఎంతదగ్గరలో వుండకలిగితే అంత దగ్గరగా వుండేవాణ్ణి. ఆమె వూట కొకవిధంగా సింగారించుకుని వచ్చేది. అప్పుడప్పుడు నామీద ఓరచూపులు విసురుతూ ఉండేది. ఆరోజుల్లో వాటితోనే జీవిస్తూ వుండేవాణ్ణి.

పేర్లు చెప్పాలసివచ్చినప్పుడు నేను ఆడ వాళ్ళలోకి చొరవజేసుకొని వెళ్లి, 'ఇవ్వాళ్ల నువ్వు ముందుచెప్పాలిరా పెళ్లాంపేరు రాముడూ' అనేవాణ్ణి. అట్లాంటప్పుడు లక్ష్మి నా పక్కనే వుండటం తటస్థించి, పెళ్లికొడుక్కు వత్తాసుగావచ్చి, 'అమ్మా!—అల్లా కాదండీ —మీ అమ్మాయే ముందుగా చెప్పాలి' అనేది. అది పెద్ద హంగామాలాగా వాగ్వివాదం పడేవాళ్లం. చివరకు 'ముందు మీరు చెప్ప కండి' అని ఆమెఅంటే—'ముందు నీవు

అసలు చెప్పకమ్మా' అని నేను పెళ్లికూతుర్ని హెచ్చరించేవాణ్ణి. అందరూ తలొక మాటా అనేవాళ్లు. చివరకు ఎవరో ముందుచెప్పే వాళ్లు. రాముడు పెళ్లాంపేరు చెప్పగానే నాకు వినబడలేదు, మళ్ళీ చెప్పమనేవాణ్ణి. పెళ్లికూతురు పేరు చెప్పినప్పుడు లక్ష్మిగూడా అంతే చేసింది. చివరకు గంటసేపటికి పేర్లుచెప్పటం తంతు పూర్తి అయ్యేది.

అప్పుడప్పుడు ఒంటరిగా కూడా మేం కలుసుకునేవాళ్లం. నేను గదిలోకి పోయినప్పుడు, ఆగదిదగ్గరకే ఆమెగూడా వచ్చేది యేదోపని వున్నట్టుగా. వీలుగావుంటే పలుకరించేది. నేను గూడా యేదో అవుసరంలేని ప్రశ్న లేస్తూ వుండేవాణ్ణి 'యేమిటి? మళ్లు కట్టుకొని భోజనాలకు పోతూంటే మీరుఇక్కడేవున్నారేం?' అనో— లేకపోతే 'వూరేగింపుకు రారా?' అనో అనేవాణ్ణి.

అయితే మొదటిరోజునుంచీ మేం ఇద్దరం ఎంతమందిలో వున్నా, యేం మాట్లాడుతున్నా, యేం మాట్లాడకపోయినా, మా ఇద్దరిమధ్యా లోకానికి తెలియని ఒక రహస్యం వున్నట్లు, మా చూపులలో ఒకఅర్థంవున్నట్లు వుండేది. మేము సంబంధంలేని అనవసరమైన హంశములను గురించి మాట్లాడుతున్నప్పటికీ నాహృదయభావమును ఆమె అర్థంచేసుకున్నట్లు ఆమె నావంక చూచేది.

మూడోరోజు మధ్యాన్నము గామాల్ను నేను ధైర్యంచేసి, ఆమెగదిలో ఒంటరిగా వుంటే కనిపెట్టి గదిలో ప్రవేశించాను. ఆమె 'యేమిటిక' అన్నట్టుగా చూచింది.

అక్కడ హార్మోనియం ఒకటి కనిపించింది. వెంటనే ఒక మిష కనిపెట్టాను. నాకు ఏమీ తోచనట్టూ, ఆమె నడిగి వాయించుకుందామని వచ్చినట్టూ నటించాను. ఆమె నేను పెట్టిన మిషకు తృప్తిపడ్డట్టు కనిపించింది, గాని ఇంతలో మానాన్నగొంతు వచ్చి మా సంభాషణ పూర్తిగా చెడగొట్టింది.

'హారే!— ఎక్కడరా?—అబ్బాయీ!' అని తన పెద్ద గొంతుతో కేకలు పెట్టాడు. నేను ఆమె గది లోంచి వచ్చాను భయపడుతూ.

'ఏం చేస్తున్నావురా, ఇక్కడ?'

హార్మోనియం అంటే పట్టిస్తుందేమోనని 'తెల్లకాగితంకావలసి ఇంటి వారిని అడుగుతున్నా' అని అబద్ధం ఆడాను. లక్ష్మి నామాటలు వింటూ గూడా వూరుకుంది.

'సరే గాని, నీవు వెంటనే సైకిలు వేసుకుని పేటకు వెళ్లి, 2,000 మల్లె పూలు కొనుక్కురావాలి— చూస్తావేం ఇంకా?— పోక!' అన్నాడు. ఎట్లాగో బయట పడ్డాం గదా అని సంతోషించి లక్ష్మివంక చూడకుండా సైకిలు ఎక్కి పోయినా.

నేను తిరిగి ఇంటికి వచ్చే టప్పటికి గంట అయింది. పూలబుట్ట మా అమ్మ చేతి కిచ్చాను. లక్ష్మిక్కడే అవుంటే ఆమెను ఒక సారి సూచనగా చూచి వచ్చాను. మెల్లాలో పని వున్న వాడి లాగా తారట్లాడుతున్నా ఆమె కొరకు.

నాచూపును అర్థంచేసుకొని తప్పక వస్తుందని నాధైర్యం. కాని ఆమె అర్థంచేసుకోలేదేమోనని భయం. అయితే రెండుమూడు నిమిషాల్లోనే నన్ను అర్థంచేసుకున్నట్టుగానే లోపలికివచ్చి, పనివున్నదానిలాగా తనగదిలోకి వెళ్ళింది, వెంటనే నేనుకూడా వెళ్ళాను వెనకాముందూ ఆలోచించకుండా.

వెనక్కుతిరిగి నావంక చూచింది 'ఎందుకు?' అన్నట్టుగా.

జేబులోంచి, మధ్య గులాబి పువ్వూ,

చుట్టూ మల్లెపూలతోనూ చెమికీతోనూ అమర్చబడినటువంటి ఒక చెండును బయటకు తీసాను.

'ఇదిగో' అన్నాను.

'ఎక్కడిది?'

'నీకోసరమని నేను కొన్నాను,'

'నా కెందుకు?'

'నీవు తల్లో పెట్టుకుంటే బాగుంటుంది.'

'చాల్లెండి—మీమాటలు.'

'చాల్లెండి లేదు—ఏం లేదు—నీవు ఆలే మాట్లాడకు—నీకోసమని నేను కష్టపడి తీసుకొస్తే!' అని, ఆమె చేతిని పట్టుకుని, అరచెయ్యి తెరచి, ఆ చేతిలో చెండును వుంచాను. ఆమె ఎదురుమాటాడక నావంక చూస్తూ నిల్చుంది.

అక్కడితో నాధైర్యంఖర్చయిపోయింది. ఎందుకనో ఆమెవంక కన్నెత్తి చూడలేక పోయినా, పెద్ద తప్పుచేసినవాడిలాగా. అప్పుడు మానాన్న నన్ను చూచివుంటే చంపేస్తాడని తోచింది. అంతట ఆ గదిలోంచి వెనక్కు ఒక్కపరుగు తీశాను.

ఎవరికీ కనపడకుండా తిరిగాను గంటా గంటన్నర. నేను ఇట్లా చేశానని లక్ష్మి మా అమ్మతో చెపుతుందనీ, మాఅమ్మ మా నాన్నతోనూ, ఇతరులతోనూ చెపుతుందనీ భయంవేసింది. చివరకు ధైర్యంచేసి సాయంత్రానికి పెళ్ళివారింటికి వెళ్లాను. అక్కడ మేజువాణీ జరుగుతూంది. నన్ను ఎవరూ వింతగా చూడలేదు—మా నాన్నగాని, మా అమ్మగాని, లక్ష్మికూడా అక్కడేవుంది. నా కొరకేగామాల్ను అటూఇటూ చూస్తూంది. నేను ఇచ్చిన చెండు జెడలోపెట్టుకుంది. నన్ను చూచి చిరునవ్వుగూడా నవ్వింది. అప్పటికి ధైర్యం వచ్చింది. నేను అనవసరంగా భయపడ్డానని తెలుసుకున్నా.

మర్నాడు. నాలో ఒకవిధమయిన ఉద్రేకమూ, ఉత్సాహమూ పుట్టింది. ఎనిమిదింటి నుంచీ గది దగ్గర ఏదో పనివున్నవాడిలాగా నటిస్తూ కాపలాకాస్తూ కూర్చున్నా. లక్ష్మి ఒంటరిగా గదిలోచిక్కిందంటే పట్టుకుని హృదయం విప్పి చెప్పుదామని నాప్రయత్నం. ఆమె చాలాసార్లు ఆదారిన నడిచింది, నన్ను ఓరగా చూచింది, కాని నాకు సావకాశ మివ్వలేదు. ఒంటరిగా గదిలో కాలుపెట్టలేదు.

కాని నేను నిరుత్సాహుణ్ణి కాలేదు. భోజనాలకుముందు ఆమె గదిలోకి రావలసిన అవసరం కలిగినప్పుడు, నేను ఇంకా అక్కడే వుండటంచూచి ఏదో ఒకపిల్లను వెంట తోడుగా తెచ్చుకుని గదిలో కావలసిన వస్తువు తీసుకుని వెళ్లిపోయింది. అప్పుడు నాకు నిరుత్సాహంకల్గింది. ఆమె నన్ను స్పష్టంగా ఎడంచేస్తూందని తెలుసుకున్నా. నాకు కారణం తెలియలేదు. ఏడుపుకూడా వచ్చింది.

కాని మధ్యాన్నం పూర్తిగా నిరాశ చెందక వేరుపంధా తొక్కాను.అక్కడే గొంతు మీద కూర్చున్నట్టు కాకుండా వీధిలోకి వెళ్ళి కనపడకుండా లక్ష్మి జాడలు కనిపెడుతూ నిల్చున్నా. ఆమె నేను లేనుగదాఅని నమ్మి గదిలోకి వెళ్ళినప్పుడు పోయి, దొంగను పట్టుకున్నట్టు పట్టుకుందామని ప్లానువేశా.

ప్లాను పారింది. మూడుగంటల ప్రాంతమూరుకు లక్ష్మి నిశ్చింతగా గదిలోకి వెళ్ళింది ఒంటరిగా. నేను వెంటనే ఇంట్లోకి మెల్లాలోకి, జొరపడ్డాను. అక్కడ అదృష్టవశాత్తూ ఎవరూ లేరు. గదిలోమటుకు ఆమె అలికిడి వినపడుతూంది.

సరాసరి గదిలో ప్రవేశించి, ఆమెకు మా

ట్లాడటానికి ఒక్కనిమిషంకూడా సావకాశం ఇవ్వక, రెండుచేతులూ పట్టుకుని దగ్గరకు లాక్కుని, రెండు బుగ్గలమీదా రెండు వేడి ముద్దులు పెట్టాను.

'తప్పు—వూరుకో—ఎవరన్నా వస్తారు —నన్ను వదులు—' అన్నది మెల్లిగా అర్ధ స్థాయిలో.

'వూరుకోను—పొద్దుటినుంచీ నన్ను—ఎట్లా ఏడిపించావు?'

'ఏం?'

'నేను నీకోసం—వేచు కున్నానని నీకు తెలుసుగా?'

'నేను ఒంటరిగా చిక్కితే, ఇట్లాంటిపని చేస్తావనికూడా నాకు తెలుసు.'

'మరి నే నెట్లా వూరుకోను?'

'ఇప్పుడు కాదు—ఎవరో వస్తున్నారు—రాత్రికి—'

'ఒక్క ముద్దు—'

'కాదు—రాత్రికి — రాత్రికి—' అని నన్ను తప్పించుకుని పారిపోయింది.

ఆ సాయంత్రమంతా కాలచక్రం తిరుగుతూన్నట్టు నాకు కనిపించలేదు. నాకాళ్లు భూమిమీద నడుస్తున్నట్టుగా లేదు. రాత్రి సంగతి ఆలోచనలోకివచ్చి, గుండె గబగబా కొట్టుకొంటూంది. మా నాన్నను చూచినప్పుడల్లా, నాఉద్రేకమునూ, నాపరధ్యాన్నమునూ కనిపెట్టి అనుమానపడతాడేమోనని భయము. అందుకని సాధ్యమైనంతవరకూ మా నాన్నను తొలిగి వుంటున్నా.

ఒక్కసారి ఆయన నన్ను పట్టేసి 'ఏమిట్రా, అబ్బాయీ?—వైభవంగా పెళ్లి అవుతూంటే నీజాడ ఎక్కడా కనపడదు?—పొద్దాకులూ ఏం చేస్తూంటావో!— చేతికి అక్కరకొచ్చిన వాడవు ఒక్కపని సంబాళించుకోలేవు?—ఇంకా ఎన్నాళ్ళకురా మీకు జ్ఞానంవచ్చేది?' అని నాలుగూ జాడించాడు. మాటాడ లేక పిల్లిలాగా జారుకున్నా.

రాత్రికోరకు ఎంత వుత్సాహపడుతున్నానో, అంత భయంగూడా పడుతున్నా. ఎంత రహస్యంగాచేసినా, మానాన్నకు తెలియకుండా ఏపనీ నేను చేయలేనని నా కోక భయము. నా ప్లాను లన్నిటికీ ఆయిన సైంధవుడు లాగా అడ్డుపడి, నన్ను పట్టేస్తాడని నా కోక పెద్ద అనుమానము. కాని యముడంతవాడికి భయపడి కూడా లక్ష్మిని వదలలేను. ఏ అవాంతరం వచ్చిపడ్డాసరే రాత్రి కొరకు నిరీక్షిస్తున్నా.

లక్ష్మి మీద ఒకకన్ను వేసి వుంచాను సాయంత్రమంతాను. ఆమె తనకు ఏమీ జరగనట్టు మామూలుగా మేజువాణీల్లో, పాటల్లో, ఊరేగింపుల్లో మునిగి తేలుతూంది. నావంక నన్నా చూడటం మానేసింది. కాని ఆమె మనస్సులో నన్నుగురించే ఆలోచిస్తున్నదని నాకు తెలుసును. మాగ్రంథం చాలాదూరం పోయిందని ఆమె పస్తాయిస్తున్న దేమోనని నాకు అప్పుడప్పుడు అనుమానం కలిగేది. ఆమె పవిత్రతను మలినంచెయ్యటం నాకు భావ్యమయినపనా అనిగూడా ఆలోచించాను; కాని ఆమె సాన్నిధ్యం కోరకుండా వూరుకోలేకపోయినా. రాత్రి ఎప్పుడు వస్తుందాఅని కనిపెట్టుకు కూర్చున్నా.

రాత్రి భోజనాలు అయ్యేటప్పటికి పొద్దుపోయింది. ఎదురుకోల అయ్యేటప్పటికి 12 అయింది.

లక్ష్మి రాత్రిళ్లు పడుకోటం ఆ గదిలోనే.

నేను రహస్యంగా గదిలోకి రావటానికి సావకాశం ఇస్తుందని నానమ్మకము. తొందరపడకుండా చుట్టుపక్కల తారట్లాడుతున్నా.

మా నాన్న ఎదురుకోల అయింతరువాత కనిపించలేదు. ఇదికూడా శుభసూచకంగానే వుంది అనుకున్నా.

ఒక్కొక్కరే ఏదో ఒక చాపో, జంపకానో చూచుకుని సావిట్లోనో పంచలోనే పడుకుంటున్నారు.

లక్ష్మి పడుకునే ప్రయత్నం లేకుండా ఏదో రాచకార్యం చేస్తూనేవుంది చివరకు కొంత సేపటికి లేచి లోపలికి వెళ్ళింది—తనగదిలోకి. వెంటనే కాక కొంచమాగి, ఎవరూ చూడకుండా గదిలోకి పోదామని నా ఆలోచన. ఆమె నాకోరకు తప్పక తలుపుతీసి వుంచుతుందని నా ఆశ.

అరగంట ఆగి మెల్లి గా మెల్లాలోకి వెళ్లాను. గదివాకిట్లో చాపవేసుకుని ఎవరో పడుకున్నారు. నిదానించి చూచాను. ఆమె లక్ష్మి తల్లి. ఆమె నా అలికిడి కనిపెట్టి 'ఎవరు వారు?' అంది. 'నేను' అన్నాను. దేనికోరకో వెతుకుతూన్నట్టు నటించి, గది తలుపు లోపల వేసివున్నట్టు గ్రహించుకుని ఇవతలకు వచ్చాను.

నాకు ఒక విధమయిన నిరాశవచ్చింది. లక్ష్మితల్లి రాక్షసిలాగా ప్రత్యేకం నా కోరకే నియమింపబడ్డట్టుగా ఆ తలుపును కాపాడుతూంది. లక్ష్మి లోపల తప్పక వుందని నాకు తెలుసును. నిస్పృహతో ఒక చాప వుంటే దానిమీద పడుకున్నా. కళ్ళవెంట నీళ్ళు గూడా వచ్చినయి.

కొంతసేపటికి ఒక వూహా తట్టింది. ఆ గదికి రెండో తలుపు దక్షిణవైపు చిన్న దొడ్డోకివుంది. ఆదొడ్డో ప్రవేశించానంటే తలుపుగుండా లక్ష్మిని మెల్లిగా పిలిచి గదిలో ప్రవేశించ వచ్చునని తోచింది.

ఈవూహాపుట్టిన తర్వాత ఒక్క నిమిషం పడుకోలేదు. దక్షిణావైపు దొడ్డివాకిలి దగ్గరకు వెళ్లాను. నేను అనుకొన్నట్టుగానే తలుపు లోపల గడియవేసివుంది. గోడదూకు తేనే గాని దొడ్లో ప్రవేశించలేను.

గోడదూకటం నాకు ఆటే కష్టంగా కనిపించలేదు. కాని, ఎవరన్నాచూస్తే దొంగలని వెంటపడతా రేమోనని భయంవేసింది. అందుకని నాలుగుపక్కలా పరీక్షించిచూచి, చూపుమేరలో ఎవరూలేరని రూఢిచేసుకుని, ఒక వూపుతో గోడఎక్కి అవతలకు దూకాను, చప్పుడులేకుండా.

గదిలో లాంతరు వెలుగుతూంది. తలుపు భార్లగా తీసివుంది నా కోరకేనని అనుకున్నా. అయినా ఎందుకయినా మంచిదని, వెన్నెలలో గోడనీడవుంటే ఆనీడలో నక్కి గది దగ్గరకు వెళ్లాను. లక్ష్మి మంచంమీద కూర్చుని తనలో తాను నవ్వుకుంటున్నట్లు కిటికీలోంచి కనిపించింది. ఇక ఆగలేక 'లక్ష్మీ' అని అంటూ గదిలో ప్రవేశించాను.

నాపిలుపు వినగానే లక్ష్మి గాభరా పడుతూ లేచి నిల్చుంది. ఆ తొందరలో రెండునోట్లేవో ఆమె చేతిలోంచి జారి కిందపడ్డయి ఆక్షణంలోనే మంచంమీద ఎవరో లేచి కూర్చుంటున్నారు. అది ఎవరో కాదు మా తండ్రి శీతారామయ్య!

నేను స్తబ్ధుణ్ని అయిపోయినా, నోట మాటరాలేదు.



ఆయన లేచి కూర్చున్నతర్వాత గాని నన్ను చూడలేదు. నన్ను ఓరగాచూచి

గుర్తు పట్టి తక్షణమే నాకు మొహం కనపడకుండా దుప్పటి ముసుకు వేసుకున్నాడు. మందమతి అయిన నేను ఆయన్ను చూడలేదనీ, అథవా చూచినా గుర్తుపట్టి వుండ వనీ ఆయన ఆశపడ్డాడు గామాల్ను. ఆయ నంటే వుండే గౌరవమూ, భయమూ ఒక్క సారిగా పోయినయి. ముసుకు వేసుకుంటే మటుకు ఈ పిరికిపంద నన్నెట్లా తప్పించుకు పోగలడు అనుకున్నా.

ఆ ముసుగుతోనే మెల్లిగా లేచి, గోడవైపు మొహంపెట్టి ఎండ్రకాయలాగా వాకిలి దాకా నడిచి, దొడ్డోకిదూకి కనపడకుండా పారిపోయినాడు.

ఇంతలో లక్ష్మి 'ఏమిటి-ఇట్లా ఎందుకు వచ్చావు?' అన్నది.

'నీవు ఇంతదానివి అని తెలియక' అన్నాను కోపంతో.

అంతే, ఇక అక్కడ ఒకక్షణంగూడా వుండ లేదు. గది తలుపు తీసుకొని మెల్లా లోకి వచ్చాను.

తలుపు చప్పుడు కాగానే పడుకున్న ముసలిది మేలుకొని 'ఎవరు వారు' అంది మళ్లా.

'నీవు ఇక్కడ కాపలా కూడానా?' అని నా కసితీర ఒకతన్ను తన్ని పోయినా.

[ఈ కథ తెనాలిలోని యువకార్యాలయమువారు నూతనముగ ప్రచురించిన శ్రీయుత పిల్లలమర్రి బాలకృష్ణశాస్త్రిగారి 'రూమ్ టు లెట్' అను ఆరు వినోదకథలసంపుటినుండి గ్రహింపబడినది. ఆధునికాంధ్రకథకులలో ఎన్నదగినవారిలో బాలకృష్ణశాస్త్రిగారు ఒకరు. ప్రస్తుతగ్రంథములోని ఆరుకథలను ఒక్కబిగిలో చదివినచో రెండు ప్రధానలక్షణములు కనిపించును: స్త్రీపాత్రల విలక్షణత, ప్రసాదమైనహాస్యము. తనపై మోహదృష్టి బరపిన నారాయణమూర్తికి 'రూమ్‌టులెట్'లో శ్యామలనేర్పిన గుణపాఠము, 'సంస్కరణం'లోని మధురం సాహసము, 'నేనూ నాసీతా'లోని సీత అమాయికమైన నిర్భయత, 'మొదటిసారి'లోని లక్ష్మి కాముమును ధనమునకు లొచ్చుచేయుట—ఆయాకథలను ప్రధానముగా నిర్వహించినవి. ఈ స్త్రీపాత్రలముందు ఆకథలలోని పురుషపాత్రలు ప్రకాశమునకు రాలేదు. ఇక కృష్ణశాస్త్రిగారి హాస్యరచనానైపుణ్యమును తెలిసికొనుటకు 'రంగా యం.,ఏ.' అను కథయు, 'వాసు పాటకచ్చేరీ' అను కథయు చదివితీరవలయును. 'రంగా యం. ఏ' చదువుచుండ పెదవులను దాటనినవ్వు - 'వాసు పాటకచ్చేరీ'చదువుచుండ పెదవులనుదాటివచ్చు పెలుచనవ్వు. ఇట్టి హాస్యరచన తెనుగుకథకులలో తలుచుటకు క్రొనుసైజున నూరుపుటలునిండిన ఈ ఆరుకథల సంపుటి వెల నాలుగు అణాలు మాత్రమే.]